

రాత్రివేళలో ఇసుక దందా

కాఖండ్యాంలో ఇసుక దందా జరుగుతోంది. రాత్రి వేళ యథేచ్ఛగా ఇసుక తీసుకెళ్లిపోతున్నారు. - 10లో



కష్టాల్లో 'పెద్ద కొడుకు'

కొబ్బరి రైతులకు కష్టాలు తప్పడం లేదు. నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం. - 10లో

నిల్వ ఉన్న చేపలు, రొయ్యల వల్లే డయేరియా

జి.సిగడాం: వెలగాడ గ్రామంలో నిల్వ చేసిన చేపలు, రొయ్యలను తినడం వల్లే ఎక్కువ మంది డయేరియా బారిన పడినట్లు తెలుస్తోంది. గ్రామంలో 35 మంది వరకు డయేరియా బారిన పడ్డారు. 15 మందిని రాజాం, శ్రీకాకుళంలోని ఆస్పత్రులకు తరలించారు. 20 మందికి ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నారు. ఆదివారం కేసులేమీ నమోదు కాలేదు. అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ వర్ధంతి



నరసన్నపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. నియోజకవర్గ స్థాయి, మండల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉదయానికే వైఎస్సార్ విగ్రహాలు శుభ్రం చేసి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో చేపట్టనున్న కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొంటున్నట్లు కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

వలసల నివారణపై ప్రత్యేక దృష్టి



మత్స్యకారులతో కమిషనర్, సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: వలసల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, మత్స్యకారులకు సంక్షేమం, అభివృద్ధి దిశగా పథకాలు అందజేస్తామని మత్స్యశాఖ కమిషనర్ డోల శంకర్ (ఓఎఫ్ఎస్) అన్నారు. మండల పరిధిలోని పెదగనగళ్లవానిపేట సముద్ర తీర ప్రాంతంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. వలసలు నివారణ దిశగా రానున్న రోజుల్లో కేరళలోని నడుపుతున్న బోట్ హౌసింగ్ లేదా డ్యూయల్ బోట్ల ద్వారా స్కూడా డ్రైవింగ్ పద్ధతిని తీసుకురానున్నట్లు తెలిపారు. అలంకరణ చేపల పెంపకంతో పాటు స్థానికంగా టూరిజం డెవలప్ చేయడం ఇకో టూరిజం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మత్స్యకారులకు కావాల్సిన ఉద్యోగ కల్పన చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీడీ ఫిషరీష్ పి.శ్రీనివాసరావు, ఎఫ్‌టీఓ గంగాధర్, అసిస్టెంట్ డైరెక్టర్ వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి-మూలపేట పోర్టు రోడ్డు విస్తరణకు సన్నాహాలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి-కొత్తపేట జాతీయ రహదారి నుంచి సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు వరకూ 15 కిలోమీటర్ల పొడవునా 100 అడుగుల రోడ్డు విస్తరణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 50 అడుగులుగా ఉన్న ఈ రోడ్డును 100 అడుగుల మేర పోర్టు వరకూ విస్తరించేందుకు ప్రణాళికను రూపొందించి సంబంధిత నివేదికను ఎన్నికల ముందే కలెక్టర్‌కు పోర్టు యాజమాన్యం అందజేసింది. ఆ మేరకు ఈ రోడ్డు విస్తరణ చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవలే మంత్రి అచ్చెన్నాయుడును కూడా పోర్టు యాజమాన్యం కలిసి విస్తరణకు సహకరించాలని కోరారు.



ప్రాణాలు తోడేస్తున్నాయి

జిల్లాకు ఏమైంది..? ఓ వైపు పారిశుద్ధ్య లోపం.. మరోవైపు సర్కారు నిర్లక్ష్యం కలగలిపి ప్రజల ప్రాణాలు తోడేస్తున్నాయి. పల్లెలు, నగరాలు, హాస్టళ్లు, విద్యాలయాలు అన్నీ.. వ్యాధుల గుప్పిట చిక్కుకున్నాయి. ముప్పై మండలాల్లో దాదాపు అరవై వేల మందికిపైగా జ్వర పీడితులు ఉన్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అధికారికంగానే వీరిలో 8 మంది చనిపోయారు. అనధికారికంగా ఈ లెక్క ఇంకా ఎక్కువే ఉంటుందనే వాదన కూడా ఉంది. ఇంతటి విపత్కర పరిస్థితి ఎదురవుతున్నా పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- జిల్లాపై పంజా విసిరిన సీజనల్ వ్యాధులు
- ఓ వైపు పారిశుద్ధ్య లోపం.. మరోవైపు అందని సర్కారు వైద్యం
- జిల్లాలో మూడు వేలకు పెరిగిన డయేరియా కేసులు
- ఆర్ఎంపీలపై నెపాన్ని తోసేస్తున్న అధికారులు

అరసవల్లి: గత ఐదేళ్లలో ఎక్కడైనా జ్వరాలు ప్రబలితే వలంటీర్ వ్యవస్థ సాయంతో సర్వే నిర్వహించేవారు. సచివాలయ వ్యవస్థ సాయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకునేవారు. వైద్యారోగ్య సిబ్బందిని సకాలంలో అప్రమత్తం చేసి మందులు ఇచ్చేవారు. దీనికి అదనంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యులు ఊరికే వచ్చి బాగోగులు చూసేవారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో అసమాన సేవలు అందించిన ఈ వ్యవస్థలను కొత్త ప్రభుత్వం నాశనం చేయడంతో ఇప్పుడు పల్లెల్లో కనీసం జ్వరాలను కూడా నియంత్రించలేని స్థితికి చేరుకున్నారు.

ఇప్పుడు పాలకులు మారారు. సీజనల్ వ్యాధుల కాలం మళ్లీ వచ్చింది. కానీ గత ప్రభుత్వం చూపిన చొరవను ఈ సర్కారు చూపలేకపోతోంది. గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఊళ్లకు ఊళ్లు అతిసార వ్యాధులు, విష జ్వరాలతో వణికిపోతున్నాయి. ఏజెన్సీల నుంచి నగరాల వరకు అన్ని చోట్లా పారిశుద్ధ్యం క్షీణించింది. ఫలితంగా దోమలు పెరిగి రోగాలు ప్రబలుతున్నాయి. వెన్నెలవలసలో ఆశ్రమ పాఠశాలలో రిషిత అనే తొమ్మిదేళ్ల విద్యార్థిని నుంచి.. నిన్న కంచిలికి చెందిన చిన్నారి రూన్సీ వరకు మొత్తంగా జిల్లాలో పదుల సంఖ్యలో జ్వరపీడితులు మరణించారు. ఈ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఆర్ఎంపీలపై ఆగ్రహం..

జిల్లాలోని 30 మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కలిపి మొత్తంగా 926 ఉండగా, ఇందులో



శ్రీకాకుళం నగరంలో ప్రధాన రోడ్డుపై మురుగునీరు



174 వరకు రిజిస్టర్డ్ ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. జిల్లాలో దాదాపుగా అన్ని మండలాల్లోనూ జ్వరాలు తీవ్రంగా ఉన్నాయి. ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్ష కావడంతో పాటు క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అంతంత మాత్రం కావడంతో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు కొందరు పరుగులు తీస్తుంటే.. అత్యధికులు సమీపంలో ఉండే ఆర్ఎంపీలను సంప్రదిస్తున్నారు. అయితే జ్వరాల మరణాలకు ఆర్ఎంపీల వైద్యమే కారణమని వైద్యాధికారులు చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. జిల్లాలో అధిక ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు పంజా విసిరిన నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో కూడా ఇంటింటికీ వైద్యం, ముందస్తు జాగ్రత్తలు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ తగు చర్యలు చేపట్టకపోవడంతోనే ఇంత ప్రాణ నష్టం జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జ్వరాల మృతుల సంఖ్య పెరుగుతున్నా పాలకులు స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జిల్లాలో అన్ని చోట్ల గతంలో వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్‌ల వద్ద ఉచితంగా మందులు, వైద్య సేవలందేవి. దీనికితోడు ప్రతి సచివాలయం పరిధిలో నెలలో రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేయడంతో అన్ని ప్రాంతాల్లో ఆరోగ్యంగా ఉండేవి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఉచిత మందులు కాదు కదా.. వైద్యులు కూడా అందుబాటులో ఉండడం లేదు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

గ్రామాల్లో గత ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసి అక్కడున్న సిబ్బందితో పాటు వలంటీర్ల ద్వారా ప్రతి 50 ఇళ్లకు అన్ని రకాల సేవలందించేది. పైగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉండేది. నిత్యం తడిచెత్త, పొడి చెత్త అంటూ వేర్వేరుగా కలెక్ట్ చేసి ప్రత్యేక వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించడం, అలాగే కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం చేసేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 'గ్రామ సచివాలయాలు ఎత్తేస్తాం. సిబ్బందిని వివిధ శాఖల్లో మెర్జ్ చేసేస్తాం' అంటూ ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలతో సచివాలయ సిబ్బంది ఆందోళనలో ఉండగా..వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యమైపోయింది.

పెరుగుతున్న డయేరియా కేసులు

జిల్లాలోని ఎచ్చెర్ల, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం తదితర నియోజకవర్గాల్లో వివిధ రకాల జ్వరాలతో పాటు డయేరియా విజృంభిస్తోంది. పరిశుభ్రత లేని ప్రదేశాలు, కలుషిత తాగునీరు, కల్తీ ఆహార పదార్థాల వల్లనే డయేరియా తీవ్రమవుతోంది. ఏకంగా మూడు వేలకు పైగా డయేరియా కేసులు నమోదు కావడం భయపెడుతోంది. ఇవే లక్షణాలతో జి.సిగడాంలో మొన్న మెట్టవలస.. నేడు వెలగాడలో ఏకంగా పల్లెలన్నీ మంచాన పడ్డాయి. అంతకుముందు శ్రీకాకుళం, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం తదితర మండలాల్లో కూడా డయేరియాతో ముఖ్యంగా వసతి గదుల విద్యార్థులు మంచాన పడ్డారు. అలాగే నరసన్నపేటలో ఉర్లాంతో పాటు చెన్నాపురంలోనూ ఇంటింటికీ జ్వరాలు వచ్చేశాయి. శ్రీముఖలింగంలో మలేరియాతో పాటు వైరల్ జ్వరాలు ఎక్కువవుతున్నాయి.



కంచిలిలో జ్వరంలో మరణించిన చిన్నారి రూన్సీ (ఫైల్)

వైద్యులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు



జిల్లాలో జ్వరాల తీవ్రత అధికంగానే ఉంది. జ్వర లక్షణాలతో మృతి చెందిన రూన్సీ వినియోగించిన మందులన్నీ ఓవర్‌డోస్‌గా గుర్తించాం. ఇక జ్వరాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని డివిజన్‌కు ఒక టీంతో పాటు 91 పీహెచ్‌సీల వారీగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చర్యలను సీరియస్‌గా పరిగణనలోకి తీసుకుంటున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యులు ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా జ్వరాలతో నమోదైన కేసుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపర్చాల్సి ఉంటుంది.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్ఓ



అరసవల్లి శ్రీశయనవీధిలో మురుగునీటి నిల్వలిలా...

అధికారిక లెక్కల ప్రకారం ఇలా	ప్రస్తుతం జిల్లాలో జ్వర బాధితుల సంఖ్య	నిర్వహించిన జ్వర నిర్ధారణ పరీక్షల సంఖ్య	మృతుల సంఖ్య	అనధికారికంగా	డెంగీ కేసులు	మలేరియా	టైఫాయిడ్	డయేరియా
	63,992	3,74,331	08 (అధికారికంగా)	15 వరకు ఉన్నట్లుగా సమాచారం	31	31	201	3126

దేవుడినీ వదల్లేదు

- కాపుగోదాయవలసలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న టీడీపీ నాయకులు

సంతబొమ్మాళి: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికార పార్టీ నాయకులు దేవుడిని కూడా వదలడం లేదు. కాపుగోదాయవలసలో శ్రీరామాలయ నిర్మాణ పనులను పోలీసుల సాయంతో ఆదివారం అడ్డుకున్నారు. కాపుగోదాయవలసలో రూ.1.50 లక్షల సంఘం డబ్బుతో 2015లో రామాలయ నిర్మాణానికి పునాదులు వేశారు. ఇంకా రూ. 15లక్షలు ఆలయ నిర్మాణానికి అవసరం కావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరాడ తిలక్ గత దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌తో పాటు దేవదాయ శాఖను సంప్రదించారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు కావాలంటే ముందుగా కొంత మొత్తం డిపాజిట్ చేయాల్సి ఉంటుందని ఎండోమెంట్ అధికారులు తెలియజేశారు. ఇందుకు గాను ఆలయ ధర్మకర్త వాడరేవు సింహాచలం తన సొంత డబ్బులు రూ.మూడు లక్షలు ఎండోమెంట్ పేరున అకౌంట్‌లో డిపాజిట్ చేశారు. 2023 నవంబర్ నెలలో రూ.15లక్షలు ఎండోమెంట్ నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికి ఆలయ పనులు 70 శాతం జరిగాయి. అయితే బిల్లులు మంజూరు కావాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్య మొదలైంది. ఇప్పటి వరకు చేసిన ఆలయ నిర్మాణ బిల్లును టీడీపీ ప్రభుత్వం నిలిపివేసింది. దీనిపై ఎండోమెంట్ అధికారులను అడిగితే ఒత్తిడి వల్ల బిల్లులు నిలుపుదల చేశామని చెప్పారని గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త అంగ జనార్దన్ రావు తదితరులు తెలిపారు. బిల్లు రాకపోయినా సొంత డబ్బులతో ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పూనుకున్నారు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇది కూడా స్థానిక టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక టీడీపీ పెద్దల దృష్టికి తీసుకుని వెళ్లి పనులు నిలుపుదల చేయాలని కోరారు. దీంతో సంతబొమ్మాళి ఎస్ఐ సిద్ధార్థ ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లి నిర్మాణ పనులు ఆపివేయాలని గ్రామస్తులను కోరారు. దీంతో చేసేదిలేక ఆలయ నిర్మాణ పనులు ఆపివేశారు. చేసిన పనికి బిల్లులు ఆపడమే కాకుండా సొంత డబ్బులతో నిర్మిస్తున్నా పనులు అడ్డుకోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకులు అంగ జనార్ధనరావు, మల్లేష్ తదితరులు అంటున్నారు.



రామాలయ నిర్మాణ పనులను ఆపాలని గ్రామస్తులను కోరుతున్న పోలీసులు

నష్టం కలిగించిన విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు

టెక్కలి: విద్యుత్ వినియోగదారుడికి నష్టం కలిగించడమే కాకుండా హైకోర్టు, సీజీఆర్ఎఫ్‌ను తప్పుదోవ పట్టించిన విద్యుత్ అధికారులపై సీజీఆర్ఎఫ్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. వినియోగదారుడికి రూ.8 లక్షలు నష్ట పరిహారంతో పాటు ఆయన నుంచి వివిధ రూపాల్లో వసూలు చేసిన మొత్తానికి 12 శాతం చక్రవడ్డీతో కలిపి పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వినియోగదారుడి తరపున సమస్యపై పోరాటం చేసిన సమాచార హక్కు చట్టం ప్రతినిధి కె.శ్రీరామ్ కిశోర్ ఆదివారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. టెక్కలి విద్యుత్ శాఖ పరిధిలో భాగ్యలక్ష్మి మోడ్రన్ రైస్‌మిల్లుకు 2007 లో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. అయితే అధికంగా బిల్లులు రావడంతో పాటు తరచూ ఇబ్బందులకు గురి చేస్తుండడంతో, యజమాని బొంగు బైరాగి విద్యుత్ అధికారులను సంప్రదించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అయినట్లు సర్టిఫికెట్ ఇచ్చి మరొకటి మార్చారు. అధికంగా వచ్చిన బిల్లుల్లో వెసులుబాటు ఉంటుందని చెప్పడంతో, వినియోగదారుడు బిల్లులు చెల్లించలేదు. కొద్ది రోజుల తర్వాత సుమారు రూ.5.50 లక్షల బిల్లులు చెల్లించాలని అధికారులు చెప్పడమే కాకుండా విద్యుత్ కనెక్షన్ తీసేశారు. దీనిపై పలుమార్లు హైకోర్టును ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో రైస్ మిల్లును కల్యాణమండపంగా మార్చినప్పటికీ అధికారులు అదే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారు.

చివరగా టెక్కలికి చెందిన సమాచార హక్కు చట్టం ప్రతినిధి కె.శ్రీరామ్ కిశోర్‌ను సంప్రదించగా.. ఆయన సాయంతో సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించారు. స్థానిక అధికారులు విద్యుత్ ఉన్నతాధికారులకు, హైకోర్టుకు, సీజీఆర్ఎఫ్‌ను తప్పు దు అఫిడవిట్లు అందజేసినట్లు రుజువైంది. దీంతో రూ.8 లక్షల నష్ట పరిహారంతో ఖర్చులకు 12 శాతం చక్రవడ్డీను కలిపి పరిహారం చెల్లించాలని ఆదేశించారు. అంతే కాకుండా ఈ వ్యవహారంలో 2011 నుంచి 2024 వరకు బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



వాయుగండం దాటింది

వాయుగుండం ప్రభావంతో జిల్లా చల్లగా మారిపోయింది. ఆదివారం వర్షాలు కాస్త తెరిపినిచ్చాయి. అయితే కళింగపట్నంలో తీరం దాటిన వాయుగుండం అల్ప పీడనంగా మారుతుండడంతో భారీ వానలకు అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆదివారమంతా అధికారులు తీర ప్రాంతాల్లో పరిశీలనలు చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

- కళింగపట్నం మీదుగా తీరం దాటిన వాయుగుండం
- జిల్లాలో ఆదివారం తెరిపినిచ్చిన వర్షాలు
- భారీ వానలకు అవకాశం



నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

లోతట్టు ప్రాంతాలు జాగ్రత్త

బూర్జ: మండలంలో గల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి నదిని ఆయన ఆదివారం పరిశీలించారు. నాలుగు షట్టర్లు పరిశీలించి పాడైపోయిన షట్టర్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

తీర ప్రాంతాల్లో పర్యటన

రణస్థలం: తుఫాన్ దృష్ట్యా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలంలోని ఎస్‌జీఆర్ పురం పంచాయతీలో గల చీకటిపేట, గురయ్యపేట, పోతయ్యపేట గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామానికి వెళ్లే తోవలో మురుగునీరు నిలిచిపోవడంపై ఆరా తీశారు. సముద్ర తీర ప్రాంతాన్ని డ్రోన్ కెమెరా ద్వారా వీక్షించారు. తుఫాన్ షెల్టర్ పర్యవేక్షణ లేక విద్యుత్ సదుపాయం సక్రమంగా లేదని, అలాగే ఎక్కడక్కడ పెచ్చులు ఊడిపోతున్నాయని కలెక్టర్‌కు గ్రామస్తులు చెప్పారు.

కాజ్‌వేపై వరద నీరు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా,ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు బహుదా నది నుంచి ఇన్నేశుపేట దండు గెడ్డలో నీరు చేరడంతో వరద పొంగి పొర్లుతోంది. పంట పొలాలకు వెళ్లే కాజ్‌వేపై మోకాళ్ల లోతులో నీరు ప్రవహిస్తుండటంతో రైతులు, కూలీలు అటు వైపుగా వెళ్లేందుకు భయపడుతున్నారు.



ఇన్నేశుపేట కాజ్‌వేపై పారుతున్న వరద నీరు

నేడు విద్యాసంస్థలకు సెలవు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి, రీజినల్ ఇంటర్మీడియట్ అధికారికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థుల యూనిట్-2 టెస్ట్ పరీక్షల్లో భాగంగా నేడు జరగాల్సిన పరీక్షలు 6వ తేదీకి వాయిదా పడ్డాయి.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: వాయుగుండం కారణంగా జిల్లాలో ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్డీఓలతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాత్రి మూడు గంటల సమయంలో కళింగపట్నం సమీపంలో వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందన్నారు. వానలు ఆదివారం కొంత తెరిపినిచ్చినా ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. మండల నోడల్ అధికారులు మండలాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అవసరమైన చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో నీరు నిల్వ ఉన్నచోట్ల మోటార్ల సాయంతో వాటిని తోడించి వేయాలని, మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వెల్లడించే వరకు వేటకు వెళ్లరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా వారిని పల్లెలను చైతన్య పరచాలని తెలియజేశారు.

తీరంలో అప్రమత్తత



సముద్రతీర ప్రాంతంలో పర్యటిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం: తుఫాన్ ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సముద్రతీర గ్రామాలకు చెందిన ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. గార మండలంలోని బందరువానిపేట సముద్రతీర ప్రాంతంలో ఆదివారం ఎస్పీ పర్యటించారు. తీర గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. తీర గ్రామాల ప్రజలు సముద్రంలోనికి చేపల వేటకు వెళ్ల వద్దన్నారు.

వర్షపాతం (మిల్లీ మీటర్లలో)

సంతబొమ్మాళి	జలుమూరు	నందిగాం	పొందూరు	ఆమదాలవలస	వజ్రపుకొత్తూరు	ఎచ్చెర్ల	ఇచ్ఛాపురం	మందస	సరుబుజ్జిలి	టెక్కలి	కోటబొమ్మాళి	బూర్జ	నరసన్నపేట
66.2	35.0	31.1	15.2	38.8	40.4	19.8	16.0	24.4	18.4	31.0	27.8	10.0	14.8

సారవకోట	పలాస	పోలాకి	కవిటి	రణస్థలం	శ్రీకాకుళం	లావేరు	ఎల్ఎన్‌పేట	జి.సిగడాం	కంచిలి	మెళియాపుట్టి	గార	పాతపట్నం	హిరమండలం	కొత్తూరు
24.6	27.2	32.2	12.2	34.2	34.0	35	16.0	9.2	16.4	25.6	21.2	26.4	12.8	18.6

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై అల్లినగరం కూడలి సమీపంలో శనివారం అర్ధరాత్రి విశాఖపట్నం వైపు వెళుతున్న లగేజ్ వ్యాన్‌ను వెనుక నుంచి కంటైనర్ ఢీ కొట్టింది. వర్షం కారణంగా మెల్లగా ముందు వాహనం వెళుతుండగా, కంటైనర్ అదుపు చేయలేక డ్రైవర్ ఢీ కొట్టారు. కంటైనర్ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ నరేష్ శర్మ, సహాయకుడు పస్వాన్ గాయపడ్డారు. 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. లగేజ్ వ్యాన్ డ్రైవర్ ప్రేమ్‌కుమార్ నటరాజన్ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల హెడ్‌కానిస్టేబుల్ ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని చిన్నారికి గాయాలు

టెక్కలి రూరల్: ద్విచక్రవాహనం ఢీకొని స్థానిక కంద్ర వీధికి చెందిన చిన్నారి సమీరా గాయపడింది. ఆదివారం కంద్రవీధికి చెందిన సమీర అనే ఐదేళ్ల పాప రోడ్డు పై నడిచి వెళ్తుండగా బన్నువాడ నుంచి టెక్కలి వైపు వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చిన్నారి తలకు తీవ్రగాయాలు కాడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

ఘనంగా విశ్వహిందూ పరిషత్ షష్టి పూర్తి మహోత్సవం

కాశీబుగ్గ: పలాస శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సభాధ్యక్షురాలుగా శ్రీకాకుళం జిల్లా కళింగవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు మల్లా పద్మజ, ప్రధాన వక్తగా తొట్టింపూడి సునీతాదేవి వ్యవహరించారు. వక్తలు మాట్లాడుతూ 1964లో విశ్వ హిందూ పరిషత్‌ను స్థాపించారని తెలిపారు. హిందువులను సంఘటితం చేసేందుకు సంస్థ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు.

మృతుడు ఇచ్ఛాపురం వాసి



మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన హెచ్‌సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం బాహుదా నదిలో శనివారం రాత్రి లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం వివరాలు తెలిశాయి. మృతుడిని ఇచ్ఛాపురానికి చెందిన సువ్వారి నరసింహరాజు(35)గా బంధువులు ఆదివారం గుర్తించారని తెలిపారు. స్థానిక బెల్లుపడ కాలనీలో నివాసం ఉంటున్న నరసింహరాజు శుక్రవారం బహిర్భూమికి బహుదా నదికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో కొట్టుకుపోయి ఉండవచ్చని బంధువులు భావిస్తున్నట్లు తెలిపారు.

మానవత్వం చాటుకున్న హెచ్‌సీ

ఇచ్ఛాపురం: పట్టణంలోని బెల్లుపడ కాలనీకి చెందిన సువ్వారి సత్యనారాయణ కుమారుడు నరసింహరాజు(పింటు) బాహుదా నదిలో గల్లంతై చనిపోయిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ లేకపోవడంతో హెడ్‌కానిస్టేబుల్ తెలుకల రామారావు చొరవ తీసుకుని అంత్యక్రియలు నిర్వహించారు. నీటిలో పడి రెండు రోజులు కావడంతో గుర్తుతెలియని మృతదేహంగా రూరల్ పోలీసులు గుర్తించి స్థానిక సీహెచ్‌సీలో భద్రపరిచారు. ఆదివారం సంబంధిత వివరాలను పోలీసులు కనుగొన్నారు. అయితే నరసింహరాజు తోడపుట్టిన నలుగురు అన్నదమ్ములు, తండ్రి కూడా మృతిచెందడంతో అంత్యక్రియలు నిర్వహించే వారు ఎవరూ లేరని తేలింది. దీంతో హెచ్‌సీ ముందుకువచ్చి మృతదేహానికి హిందూ సంప్రదాయ పద్ధతిలో బాహుదానది శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎం.చిన్నంనాయుడు, పట్టణ, రూరల్ ఎస్ఐలు చిన్నంనాయుడు, శ్రీనివాసరావు, ఇతర పోలీస్ సిబ్బంది హెచ్‌సీని అభినందించారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు తీవ్ర గాయాలు

టెక్కలి రూరల్: గూడేం పంచాయతీ పరిధి సన్యాసి నీలాపురం గ్రామంలో ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై జె.ఈశ్వరి అనే వివాహిత గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈశ్వరి తన ఇంటి పెరటలో ఉన్న చెత్తను శుభ్రం చేస్తున్న క్రమంలో అక్కడ ఉన్న ఒక ఇనుప రాడ్డుని వేరే చోట పెట్టేందుకు తీస్తుండగా పై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.



గాయపడిన వ్యక్తి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కష్టాల్లో పెద్ద కొడుకు

నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం

- ఆదాయం కంటే ఖర్చు ఎక్కువవుతోందని రైతుల ఆందోళన
- తగ్గిన దిగుబడులు





రియల్ ఎస్టేట్‌గా మారబోతున్న కొబ్బరితోట



కవిటి, ఇచ్ఛాపురం రూరల్:

కొబ్బరి చెట్టును ఉద్దానం వాసులు పెద్ద కొడుకు కింద భావిస్తారు. ఆ పెద్ద కొడుకు కష్టాల్లో పడ్డాడు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత వాసులను కాపాడుకుంటూ వస్తున్న కొబ్బరి క్రమేపీ ఆదాయం కంటే ఖర్చును పెంచుతోంది. ఫలితంగా రైతులు నష్టపోతున్నారు. 1999 నుంచి వరుసగా వస్తున్న తుఫాన్లు, చీడ పీడల మధ్య రైతు ఊపిరి పీల్చుకోలేకపోతున్నాడు.

జిల్లాలో దాదాపు 38,500 ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. కొబ్బరి పంటపై ఆధారపడి 1,50,000 కుటుంబాలు ప్రత్యక్షంగానూ ఉప ఉత్పత్తులపై ఆధారపడి 10లక్షల కుటుంబాలు బతుకుతున్నాయి. గతంలో ఎకరం కొబ్బరి తోటలో దింపు తీస్తే 1500కు పైబడి కొబ్బరికాయలు దిగుబడి వచ్చేవని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు అదే తోటలో దింపు తీస్తుంటే 250 నుంచి 300 వరకు మాత్రమే వస్తున్నాయని, దింపు తీయించేందుకు, ఒలుపు, లారీ ఎక్కించే లేబరు వరకు ఒక కొబ్బరి కాయకు రూ.5 వరకు ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు. ధరలు క్షీణించడం, దిగుబడులు దెబ్బ తినడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాయం ఏదీ..?

2004–09 సంవత్సరాల్లో కొబ్బరి రైతుకు షరతులు లేని రుణమాఫీ అమలుచేసిన తొలిముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర రెడ్డి ఘనత పొందారు. బ్యాంకులో రుణం తీర్చేసి రుణమాఫీ పరిధిలోకి రాని వారికి రూ.5000 వంతున ఒక్కో రైతుకు చెల్లించారు. మళ్లీ 2019 ఎన్నికల్లో గెలిచిన వైఎస్ జగన్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.13500 అందించి తోడ్పాటు అందించారు. తిత్లీ సమయంలోనైతే చెట్టుకు రూ.3వేలు పరిహారం అందించారు. కానీ ఇప్పుడు కొబ్బరి రైతు ఒంటరైపోయాడు. ప్రభుత్వం నుంచి సాయం లేకపోవడం, తోట నుంచి దిగుబడి రాకపోవడంతో నష్టాల బాటలోకి వెళ్లిపోతున్నాడు.

తోటల్లో రియల్ ఎస్టేట్

కన్నతల్లి లాంటి కొబ్బరి తోటను వదల్లేక, పెట్టుబడి పెట్టలేక చాలా మంది రైతులు తోటలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేస్తున్నారు. ప్రస్తుతం ఈదుపురం నుంచి కవిటి మీదుగా సోంపేట వెళ్లే రహదారి, కరాపాడు టోల్‌ప్లాజా నుంచి సోంపేట వెళ్లే జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న కొబ్బరి తోటలను ప్లాట్లుగా మార్చేస్తున్నారు. పాతికేళ్ల తర్వాత కొబ్బరి తోటలు అంతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ధరలు లేవు



దిగుబడులకు తోడు కొబ్బరి ధరలు కూడా నిరాశాజనకంగా ఉన్నాయి. దిగుబడులు తగ్గినా ధర బాగుంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదు. ఐదారేళ్ల క్రితం వరకు కొబ్బరి ధర ఇరవై వేల రూపాయల వరకు ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. మంచిగా కొబ్బరి కాయలు కనిపిస్తే పన్నెండు, పదమూడు వేల రూపాయల వరకు షావుకార్లు కొనుగోలు చేస్తున్నారు. వేలల్లో పెట్టుబడి పెడుతుంటే వందల్లో ఆదాయం వస్తోంది.

– డి.రవి, కొబ్బరిరైతు, బూర్జపాడు, ఇచ్ఛాపురం మండలం

పరిస్థితులు అనుకూలంగా లేవు



మాకు ఏడెకరాల కొబ్బరి తోట ఉంది. గతంలో కొబ్బరి దిగుబడులు ఎంతో బాగుండేది. ఇటీవల కాలంలో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ప్రతి రెండు నెలలకు ఒకసారి తీసే దింపు, ఇప్పుడు మూడు, నాలుగు నెలలకు తీసేందుకు కూడా పరిస్థితులు అనుకూలంగా లేవు. దానిపై వచ్చే ఆదాయం దానికే సరిపోవడం లేదు.

– మాసుపత్రి వీరాస్వామిరెడ్డి, కొబ్బరి రైతు, సన్యాసిపుట్టుగ, ఇచ్ఛాపురం మండలం

పాత పింఛన్ విధానమే కావాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎస్ ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తమకు పాత పింఛన్ విధానమే కావాలని, సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1 బ్లాక్ డేగా నిర్ణయించామని, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గురుగుబెల్లి భాస్కరరావు అన్నారు. సీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాస్కరరావుతో పాటు ఇతర సీపీఎస్ సంఘం నాయకులు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఏకైక డిమాండ్‌తో ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు. ఉద్యోగులకు మేలు చేసేది కేవలం పాత పింఛన్ మాత్రమేనని కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేసి సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్ రద్దు చేయాలని ఏపీటీఎఫ్ డిమాండ్

సీపీఎస్ విధానం రద్దు చేయాలని, ఆ స్థానంలో పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ (1938) ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బల్లెడ రవి, బుక్కూరు వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవ అధ్యక్షులు టెంక చలపతిరావులు మాట్లాడుతూ రాజకీయ నాయకులకు ఓపీఎస్‌ను అమలు చేస్తూ టీచర్లకు మాత్రం సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ అంటూ మోసం చేసేందుకు చూస్తున్నారని అన్నారు.

రాత్రివేళలో ఇసుక దందా



కాఖండ్యాం ర్యాంపు నుంచి రాత్రి వేళలో తరలిస్తున్న ఇసుక

సాక్షి టాస్క్‌ఫోర్స్: బూర్జ మండలం మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ఇసుక ర్యాంపు నుంచి రాత్రిపూట ఇసుక తరలిపోతోంది. సాయంత్రం ఆరు గంటల తర్వాత అనుమతులు లేకుండా ఇష్టానుసారం ఇసుకను తీసుకుపోతున్నారు. ఇక్కడ అధికారికంగా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తే రాత్రి ఇలా అక్రమాలు జరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. స్థానిక నాయకుడు సనపల సురేష్ ఇప్పటికే అన్ని శాఖలకు సమాచారం తెలియజేశారు.

వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్తపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు లండ మాలతి



బాధితురాలు మాలతి పరిస్థితిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

కంచిలి: బల్లిపుట్టుగ గ్రామంలోని జన్నివీధిలో ఆదివారం రాత్రి లండ మాలతి అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తపై అదే వీధిలోని టీడీపీకి చెందిన పాడియా సునీల్ ఇటుక బెడ్డతో దాడికి తెగబడ్డాడు. ఆమె తలకు ఆరు కుట్లు పడ్డాయి. గడిచిన ఆరు నెలలుగా ఈ వ్యక్తి వీధిలో వీరంగం చేస్తూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుండేవాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇతని చేష్టలు మరింత ఎక్కువయ్యాయి. వీధిలో కత్తి పట్టుకొని తిరుగుతూ బెదిరిస్తుండేవాడని బాధితురాలు తెలిపింది. ఎంతగా రెచ్చగొట్టినప్పటికీ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సంయమనంతో ఉంటున్నారు. ఏ మాత్రం తిరగబడినా అదే అదనుగా కేసులు పెట్టించాలనేది వారి ఆలోచన అని భావించి సంయమనంతోనే ఉండేవారు. చివరికి ఆదివారం రాత్రి ఎలాంటి కారణం లేకుండా లండ మాలతితో పాడియా సునీల్ గొడవపడి ఇటుక బెడ్డతో తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైంది. బాధితురాలు కవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి సోంపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ లండ మాలతిపై దాడికి పాల్పడిన సునీల్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో సిస్టం



ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైం: వినాయక చవితి ఉత్సవాలకు అనుమతుల కోసం ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిందని ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని సందేశం పంపిస్తే చాలని, నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా ప్రజల యొక్క మొబైల్ ఫోన్‌కు వస్తుందన్నారు. ఆ తర్వాత http:ganeshutsav.net అనే వెబ్‌సైట్‌లో నందు గణేష్ మండపం ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు. ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గోపాలపెంట, చేనులవలసలో ఇసుక అక్రమ తవ్వకాలు



నరసన్నపేట ఎస్ఐ పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

నరసన్నపేట: మండలం గోపాలపెంట, చేనులవలసల్లో వంశధార నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. మడపాం, బుచ్చిపేటల వద్ద వంశధారలో నీటి సామర్థ్యం పెరగగా ఇసుక తవ్వకాలకు వీలు కలగకపోవడంతో గోపాలపెంట, చేనులవలస, ఉప్పరిపేటల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలకు స్థానికులు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గోపాలపెంట నుంచి అక్రమంగా తరలుతున్న ఇసుక ట్రాక్టర్‌ను నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ శనివారం రాత్రి పట్టుకున్నారు. వీఆర్వోలు నైట్ డ్యూటీలు నిర్వహిస్తున్నా.. వారి కళ్లు కప్పి స్థానికులు ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.

అకారణంగా తొలగిస్తున్నారు

- వమరవల్లి రెసిడెన్షియల్ పాఠశాల నుంచి వర్కర్ల తొలగింపు
- వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చారని కక్ష



గేట్ వద్ద ఆందోళన చేస్తున్న గురుకుల పాఠశాల వర్కర్లు

గార: వమరవల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో పదేళ్లకు పైబడి పని స్థానిక గొర్లెవానిపేట గ్రామస్తులు పనిచేస్తున్నారు. వారిలో కుక్, అటెండర్, ఇద్దరు హెల్పర్లకు ఒకటో తేదీ నుంచి పనికి రావద్దని చెప్పారు. శనివారం సాయంత్రం వరకు పనిలో ఉన్నామని, ప్రిన్సిపాల్ పిలిచి రేపటి నుంచి మీ నలుగురు రావద్దని చెప్పారని చాట్ల లత, బెవర పుణ్యవతి, బలగ జ్యోతి, బెవర గన్నెమ్మలు తెలిపారు. తామంతా వైఎస్సార్ సీపీకి మద్దతిచ్చామని, అందుకే కూటమి నాయకుల ఒత్తిడితోనే ఇదంతా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో పని చేస్తున్న వారిని కాకుండా కొత్తగా ఇద్దరిని తీసుకోవడంతో వివాదం చోటుచేసుకుంది. స్కూల్ గేట్ వద్ద వారంతా ఆదివారం ఉదయం ఆందోళన చేశారు. మద్దతుగా కొందరు గ్రామస్తులు చేరడంతో పోలీసులు వచ్చి సర్ది చెప్పారు. సోమవారం జిల్లా ఉన్నతాధికారులకు వినతులు అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ చిట్టిలత వద్ద ప్రస్తావించగా వర్కర్లందరూ రోజువారి వేతనదారులుగానే పని చేస్తున్నారని, పది మంది ఉండగా వేతనం ఎక్కువగా ఉండడంతో పది మందిని సర్దుబాటు చేసుకోవాలని చెప్పానని, ఏడుగురు వస్తున్నారని తెలిపారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరించినా..



పిండి మిల్లును రన్ చేస్తున్న మహిళ

నరసన్నపేట: స్థానిక బొంతల వీధిలోని పిండి మిల్లు వ్యవహారంలో అధికారుల ద్వంద్వ వైఖరి విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ కోర్టు ఆదేశాల మేరకు పిండిమిల్లుకు తాళం వేయగా.. కొందరు టీడీపీ నాయకులు తాళాలను బ్రేక్ చేసి షాపు తెరిచారు. ఇది కోర్టు ధిక్కారమే అవుతుందని స్థానికులు చెబుతుండగా.. ఆ మిల్లును ఇప్పుడు రన్ చేయడం ప్రారంభించారు. అయినా అధికారులు కిక్కురుమనడం లేదు. మిల్లును పాత పద్ధతిలో రన్ చేస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీని వల్ల శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం వస్తోందని అంటున్నారు. ఈ వ్యవహారంలో మొదటి నుంచి ఫిర్యాదు దారుల తరఫున కోర్టులో వాదిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది డీవీరావు మాట్లాడుతూ ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులకు కంటెమ్ట్ నోటీసు ఇచ్చామని దీని గడువు సెప్టెంబర్ 3వ తేదీతో ముగుస్తుందని అన్నారు. ఈ లోగా మిల్లు రన్నింగ్‌పై అధికారులు చర్యలు తీసుకోకపోతే కోర్టులో కంటెమ్ట్ దాఖలు చేస్తామని తెలిపారు.

● ఆత్మీయంగా..



తిలారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-89 మధ్య చదువుకున్న వారు ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లోని ఒక కల్యాణ మండపంలో కలిశారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సందడిగా గడిపారు.

– నరసన్నపేట

● అరుదైన సర్పం హతం



వజ్రపుకొత్తూరు రూరల్: మండలం మహదేవపురంలో ఆదివారం అరుదైన సర్పం గ్రామస్తుల చేతిలో హతమైంది. రోడ్డుపై సంచరిస్తున్న సర్పాన్ని చూసి స్థానికులు భయాందోళన చెంది కర్రలతో కొట్టి చంపేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో పంట పొలాలకు రైతులు వెళ్లే సమయంలో సర్పాలతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వారు భయాందోళన చెందుతున్నారు.

జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లకు ఎస్‌డీసీలుగా పదోన్నతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు వచ్చాయి. రాష్ట్రంలో ముప్పైరెండు మంది తహసీల్దార్లకు ఎస్‌డీసీలుగా పదోన్నతులు కల్పించగా, ఇందులో ముగ్గురు మన జిల్లాకు చెందిన తహసీల్దార్లు ఉన్నారు. సాదు దిలీప్ చక్రవర్తి, పప్పల వేణుగోపాలరావు, ఆమెపల్లి సింహాచలంకు ప్రమోషన్లు వచ్చాయి.

రైళ్ల రాకపోకలకు అంతరాయం



ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆదివారం పలుచోట్ల పట్టాలపై నీరు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితుల దృష్ట్యా పలు రైళ్ల సేవలు రద్దు చేయగా, కొన్ని రైళ్ల సేవలను పాక్షికంగా రద్దుచేసి, మరి కొన్నింటిని దారి మళ్లించి నడిపిస్తున్నట్లు ప్రకటించారు. – భువనేశ్వర్

రద్దయిన రైలు సేవలు

తేదీ	స్టేషను	రైలు
సెప్టెంబర్ 2	నాందేడ్	20810 నాందేడ్ – సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్
సెప్టెంబర్ 3	ఎల్‌టీటీ	18520 ఎల్‌టీటీ – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్
సెప్టెంబర్ 2	విశాఖపట్నం	20833 విశాఖపట్నం – సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్
సెప్టెంబర్ 2	సికింద్రాబాద్	20834 సికింద్రాబాద్ – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్
సెప్టెంబర్ 2	ఇరువైపుల నుంచి	20707/20708 సికింద్రాబాద్ – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్

పాక్షిక రద్దు

ఆదివారం సంబల్‌పూర్ నుంచి నాందేడ్ బయల్దేరాల్సిన 20809 సంబల్‌పూర్ – నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు విశాఖపట్నం వరకు పరిమితం చేసి విశాఖపట్నం, నాందేడ్ స్టేషన్ల మధ్య సేవల్ని పాక్షికంగా రద్దు చేశారు.

దారి మళ్లింపు

తేదీ	రైలు	దారి మళ్లింపు
సెప్టెంబర్ 1	20819 పూరీ – ఓఖా ఎక్స్‌ప్రెస్ ఖుర్దా రోడ్	విశాఖపట్నం, విజయనగరం, రాయగడ, టిట్లాగఢ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్, వార్ధా మీదుగా..
సెప్టెంబర్ 1	20805 విశాఖపట్నం – న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్	విజయనగరం, రాయ్‌పూర్, నాగ్‌పూర్ మీదుగా..
సెప్టెంబర్ 1	11020 భువనేశ్వర్ – ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్	విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్ మీదుగా..
సెప్టెంబర్ 2	12803 విశాఖపట్నం – నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్	విజయనగరం, రాయగడ, టిట్లాగఢ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్ మీదుగా..
సెప్టెంబర్ 1	18520 ఎల్‌టీటీ – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్,ఎల్‌టీటీ	సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు మీదుగా...
సెప్టెంబర్ 1	12804 నిజాముద్దీన్ – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్	నిజాముద్దీన్, నాగ్‌పూర్, రాయ్‌పూర్, టిట్లాగఢ్, రాయగడ, విజయనగరం మీదుగా...
సెప్టెంబర్ 1	11019 ముంబై–భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్	ముంబై, సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా..